నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 2 జూలై 2024 | NALGONDA

జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

ప్రజా సేవలో పాలకుల పాత్ర కీలకం

- అధికారులు నిబద్ధతతో పని చేయాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్.ఎస్, జూలై 1 : ప్రజా సేవలో ప్రజా ప్రతినిధులు పాత్ర కీలకమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్.ఎస్‌లో సోమవారం ఎంపీపీ మర్ల స్వర్ణలతాచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారులు నిబద్ధతతో పని చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ప్రజలకు సేవ చేసే వారు శాశ్వతంగా నిలబడుతారని, నాయకులుగా ఎదుగుతారని తెలిపారు. ఆత్మకూర్.ఎస్ మండలంలో జరిగిన అభివృద్ధి సూర్యాపేట నియోజకవర్గంలోని ఏ మండలంలోనూ జరుగలేదన్నారు. మండలంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి జగదీశ్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐదేండ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న మండల పరిషత్ అధ్యక్షురాలు, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, మండల ప్రాదేశిక సభ్యులను ఎంపీడీఓ ఎండీ హసీం నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ నేరెళ్ల వెంకన్న, తాసీల్దార్ వినోద్‌కుమార్, ఏఓ దివ్య, ఎంపీఓ సంజీవ, ఏపీఓ ఈశ్వర్, ఏపీఎం మంజుల, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

అప్పులు తెచ్చి ప్రజావాణి నిర్వహించలేం

- పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేకపోతున్నం
- డబ్బులు లేక కుటుంబాన్ని కష్టంగా నెట్టుకొస్తున్నం
- నకిరేకల్‌లో ఎంపీడీఓకు పంచాయతీ కార్యదర్శుల మొర

నకిరేకల్, జూలై 1 : 'పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్నాం. ఆరు నెలల నుంచి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులు రాక సొంత డబ్బులు ఖర్చులు పెట్టి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించాం. డబ్బులు లేక కుటుంబాన్ని కష్టంగా నెట్టుకొస్తున్నాం. ఇప్పుడు కొత్తగా అప్పులు తెచ్చి ప్రతి గురువారం గ్రామాల్లో ప్రజావాణి నిర్వహించలేం. డబ్బులు ఇప్పించిన తర్వాతే ప్రజావాణి నిర్వహించండి' అని నకిరేకల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పంచాయతీ కార్యదర్శులదరూ కలిసి ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ 2024 ఫిబ్రవరి మొదటి వారంలో సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఆ రోజు నుంచి గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం కావాల్సిన నిధులు మంజూరు చేయలేదని, సర్పంచులు దిగిపోయేనాటికి అన్ని రకాల నిధులు డ్రా వారు చేసుకున్నారని తెలిపారు. ఉన్న అరకొర నిధులతో ఏ పని ముందు చేయాలో? ఎవరికి జీతాలు చెల్లించాలో, తక్షణ అవసరాలు ఎలా తీర్చాలో అయోమయంలో సర్దుబాటు చేసుకుంటూ వచ్చామని చెప్పారు. ఇందులో భాగంగా కార్యదర్శులందరూ సొంతంగా డబ్బులు పెట్టుకుని రాష్ట్ర, జిల్లా అధికారులు, మండల అధికారుల హెచ్చరికలు, సూచనల మేరకు పనులు చేస్తూ వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తాము ఎండాకాలంలో నీటి సమస్య తలెత్తకుండా సొంత డబ్బులతో బోర్లు రిపేర్లు, కొత్త మోటర్లు, లీకేజీలకు మరమ్మతులు చేయించామని చెప్పారు. గత 6 నెలల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు గ్రామాలకు విడుదల చేస్తారేమోనని ఎదురు చూస్తున్నామని, అవి రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతి గురువారం నిర్వహించే ప్రజావాణికి కొత్త అప్పులు తెచ్చి నిర్వహించే పరిస్థితిలో తాము లేమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అంతకుముందు పెట్టిన డబ్బులు ఇప్పించాలని, ఆ తర్వాత గ్రామ స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కె.రవీందర్‌రెడ్డి, జగన్‌మోహన్, నాగమణి, సురేశ్, యాదగిరి, రమేశ్, శంకరయ్య, రవీంద్రాచారి, కోటమ్మ, సూర్యప్రకాశ్‌రెడ్డి, అంజయ్య, శ్వేత, స్వాతి, అరుణ్‌కుమార్ ఉన్నారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సుహాసిని మృతి కేసులో ఆరుగురి అరెస్టు

- లింగ నిర్ధారణ చేసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు
- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట, జూలై 1 : అబార్షన్ ఫెయిల్ అయి గర్భిణి మృతి చెందిన ఘటనలో ఆరుగురిని అరెస్టు చేసినట్లు సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం బట్టుతండాకు చెందిన బట్టు కృష్ణ, క్రాంతి కుమార్తె సుహాసిని(27)ని చివ్వెంల మండలం ఎంజీనగర్ తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు కాగా ఆపరేషన్ చేయించుకుంటానంటే భర్త వద్దని మగ పిల్లాడు కావాలని లేకుంటే మరో వివాహం చేసుకుంటానని బెదిరించాడు. దాంతో సుహాసిని దానిని విరమించుకోగా మరోసారి గర్భం దాల్చింది. స్కానింగ్ కోసం కోదాడలోని డాక్టర్ గురవయ్య ఆసుపత్రికి సుమారు రెండు నెలలు నాలుగుసార్లు తిరిగారు. నాలుగోసారి సుహాసిని గర్భంలో ఆడపిల్ల ఉందని తెలువగా భర్త, కుటుంబ సభ్యులు కలిసి అబార్షన్ చేయించుకోవాలని బలవంతం చేశారు. జూన్ 24న భర్త హరిసింగ్, సుహాసిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి కోదాడలోని ఆస్పత్రిలో చూపిస్తున్నానని చెప్పి తన ఇద్దరు పిల్లలను వారికి అప్పగించాడు. అదే రోజు హరిసింగ్, సుహాసిని, బంధువులు కలిసి హుజూర్‌నగర్‌లోని న్యూ కమల ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ షేక్ ఖాసింతో అబార్షన్ చేయించుకునేందుకు మాట్లాడుకొని సిస్టర్ ద్వారా టాబ్లెట్లు ఇప్పించాడు. మరుసటి రోజు ఖాసిం సుహాసినిని పెద్దవీడు గ్రామంలోని తన ఇంటికి తీసుకెళ్లి అక్కడికి మళ్లీ సిస్టర్‌ను పిలిపించి టాబ్లెట్స్ ఇప్పించాడు. టాబ్లెట్లు, ఇంజక్షన్ల వల్ల బ్లీడింగ్ అవుతూ అబార్షన్ కాకపోవడంతో వెంటనే ఆపరేషన్ చేయాలని ఖాసిం తమ కారులో సుహాసినిని, ఆమె భర్తను తీసుకొని మఠంపల్లి, తర్వాత కోదాడలోని గురవయ్య ఆస్పత్రిలో చేర్పించారు. మరుసటి రోజు ఉదయం గురవయ్య డాక్టర్ వచ్చి సుహాసినికి స్కానింగ్ చేసి సీరియస్‌గా ఉందని, ఖమ్మం తీసుకెళ్లాలని చెప్పడంతో అక్కడ ప్రశాంతి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ పరీక్షించి ప్రమాదకరంగా ఉందని చెప్పడంతో హైదరాబాద్‌కు అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా సూర్యాపేట సమీపంలోకి రాగానే సీరియస్‌గా మారింది. దాంతో డాక్టర్ రామ్మూర్తి ఆస్పత్రికి తరలించగా అప్పటికే సుహాసిని చనిపోయింది. అనంతరం మృతదేహాన్ని ఎంజీ నగర్ తండాకు తీసుకెళ్లారు. చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అనంతరం సుహాసిని భర్త రత్నావత్ హరిసింగ్, న్యూ కమలా ఆస్పత్రి మేనేజర్ షేక్ ఖాసిం, దేవరకొండ రాణి(నర్సు), కంపౌండర్లు రణపంగ గోపి, షేక్ సైదులు, అమరగాని నవీన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని ఎస్పీ తెలిపారు. ఇతర నేరస్తులు పరారీలో ఉన్నారని, కేసు విచారణ అనంతరం అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు. లింగ నిర్ధారణ చేసినా, ప్రోత్సహించినా పీఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, వీటికి సంబంధించిన సమాచారం పోలీసులకు అందించాలని ఎస్పీ కోరారు. కేసు విచారణలో డీఎస్పీ రవి ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటరెడ్డి, ఎస్ఐ రత్నం, ఏఎస్ఐ వెంకన్న బాగా పని చేశారని వారిని ఎస్పీ అభినందించారు.

నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

మంత్రి కోమటిరెడ్డికి నిరుద్యోగుల నిరసన సెగ

నల్లగొండ జిల్లా కేంద్రంలో అడ్డుకొని ఆందోళన

పొంతన లేని సమాధానం చెప్పి దాట వేసిన మంత్రి

మెగా డీఎస్సీ వేయాలి.. జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్

నల్లగొండ రూరల్, జూలై 1 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఉద్యోగాలు కల్పించడం లేదని, ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలేదని, మెగా డీఎస్సీ వేయలేదని నిత్యం ఏదో ఒక చోట ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలకు నిరుద్యోగుల నుంచి నిరసన సెగ తగులుతున్నది. నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, సమీక్ష సమావేశం కోసం వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నిరసన సెగ తగిలింది. నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశంలో పాల్గొని బయటకు వెళ్తుండగా ఒక్కసారిగా నిరుద్యోగులు ఆయనను చుట్టుముట్టారు. డీఎస్సీని వాయిదా వేసి పోస్టులను పెంచాలని నినాదాలు చేశారు. నిరుద్యోగులు తమ సమస్యలు చెబుతున్న క్రమంలో 'మీరు కాబోయే టీచర్లు.. క్రమశిక్షణతో ఒక్కొక్కరు చెప్పండి' అని మంత్రి వారికి సూచించారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ గత ప్రభుత్వం వేసిన పోస్టులనే కాంగ్రెస్ ప్రభుత్వం పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. టెట్‌లో చాలా మంది క్వాలిఫై అయ్యారని, మెగా డీఎస్సీలో భాగంగా 25 వేల పోస్టులు వేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్ -2 రెండు వేల పోస్టులు, గ్రూప్ -3 మూడు వేల పోస్టులు పెంచాలని, గ్రూప్-1లో 1:100 ప్రకారం పోస్టింగ్‌కు పిలువాలని కోరారు. డీఎస్సీ కొందరు వాయిదా వేయాలని, మరికొందరు వాయిదా వేయొద్దు అని అంటున్నారని మంత్రి సమాధానం ఇచ్చారు.

చివరికి నిరుద్యోగులకు మంత్రి సరైన సమాధానం ఇవ్వకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో డీఎస్సీని వాయిదా వేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఘెరావ్ చేస్తున్న నిరుద్యోగులు

జిల్లా గ్రంథాలయం ఎదుట ఆందోళన

రామగిరి : ఎంతో కాలంగా ఉద్యోగాల కోసం కష్టం పడి చదువుతున్నామని, గ్రూప్స్, డీఎస్సీ నోటిఫికేషన్స్ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట నిరుద్యోగులు ఆందోళన చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ పోస్టుల సంఖ్య పెంచి నోటిఫికేషన్స్ వేయాలన్నారు. తమ జీవితాలతో ప్రభుత్వం చెలగాటం అడవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రి వర్గం చర్చించి న్యాయం చేయాలని, లేని పక్షంలో నిరుద్యోగుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి

సూర్యాపేటలో నిరుద్యోగ జేఏసీ ధర్నా

సూర్యాపేట ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న నిరుద్యోగులు

బొడ్రాయిబజార్ : ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ ద్వారా 24వేలు పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు హాజరై ప్రధాన రహదారిపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చింత వెంకన్న మాట్లాడుతూ డీఎస్సీని డిసెంబర్ వరకు వాయిదా వేయాలని, గ్రూప్ -3 మూడు వేలు, గ్రూప్ - 2 రెండు వేల ఉద్యోగాలతో భర్తీ చేయాలని కోరారు. నిరుద్యోగులకు ఆటంకంగా పరిణమించిన 46జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు మద్దతుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ మేరకు గాంధీ ఆస్పత్రి వద్ద నిరాహారదీక్ష చేస్తున్న మోతీలాల్‌కు నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు పి.శ్రీనివాస్, వి.శ్రవణ్, పి.నరేశ్, సీహెచ్.విఠల్, సత్య, భవాని, జ్యోత్స్న, నజియా పాల్గొన్నారు.

ఎల్లుండి నుంచి గ్రామ స్థాయిలో ప్రజావాణి

- స్థానిక అధికారులు తప్పని సరిగా పాల్గొనాలి
- ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి పరిష్కరించాలి
- వచ్చే సోమవారం నుంచి జిల్లా స్థాయిలో ప్రజావాణి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ, జూలై 1 :గ్రామ స్థాయిలో ఈ నెల 4 నుంచి ప్రజావాణి నిర్వహించి ప్రజా సమస్యలపై వచ్చే ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమ నిర్వహణపై సోమవారం కలెక్టరేట్ నుంచి మండలాధికారులు, గ్రామ ప్రత్యేక అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం నుంచి గ్రామ స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని, ప్రత్యేక అధికారితోపాటు, పంచాయతీ కార్యదర్శి, ఏఈఓ, అంగన్‌వాడీ టీచర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ ఎంలు హాజరుకావాలని సూచించారు. ప్రతి వారం ఒక విషయంపై దృష్టి సారించాలని, పంచాయతీ కార్యదర్శులు అన్నింటినీ మాన్యువల్‌గా రిజిస్టర్‌లో నమోదు చేసి ఉంచాలని చెప్పారు. మళ్లీ వచ్చే సోమవారం నాటికి గ్రామస్థాయిలో ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని అన్నారు.

జిల్లా స్థాయిలో అత్యవసర అంశాలకు మాత్రమే..

వచ్చే సోమవారం నుంచి జిల్లా స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అందులో విద్య, వైద్యం, అత్యవసర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను మాత్రమే స్వీకరిస్తారని చెప్పారు. మండల స్థాయిలో ఫిర్యాదులు సమర్పించి అక్కడ 15 రోజులైనా పరిష్కారం కాని వాటిని ఇక్కడ సమర్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. మండల స్థాయిలో ప్రజావాణికి హాజరైన రసీదును ఫిర్యాదుదారులు తప్పని సరిగా తీసుకురావాలని సూ చించారు. కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా ప్రజావాణి నోడల్ ఆఫీసర్ శ్రీదేవి, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తాసీల్దార్లు పాల్గొన్నారు.

అర్వపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఎమ్మెల్యే సామేల్ ఒంటెద్దు పోకడ వీడాలి

- అర్వపల్లిలో సొంత పార్టీ నేతల ఆగ్రహం
- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలకు పిలువడం లేదని ఆందోళన

అర్వపల్లి, జూలై 1 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు సొంత పార్టీలోనే నిరసన సెగ తగిలింది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలకు కనీసం మండల పార్టీకి కూడా తెలుపకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు మండిపడ్డారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని పీఏసీఎస్ బ్యాంకు వద్ద సోమవారం రైతు భరోసా అభిప్రాయ సేకరణకు ఎమ్మెల్యే సామేల్ వస్తున్నాడని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల నుంచి భారీగా అర్వపల్లి మండల కేంద్రానికి చేరుకున్నారు. మొదటగా బొల్లంపల్లి గ్రామంలో విశాలాక్షి సమేత విశ్వేశ్వరాలయం మొదటి వార్షికోత్సవానికి ఎమ్మెల్యే హాజరు కావాల్సి ఉండగా మద్దిరాల నుంచి బయల్దేరిన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఊర్లోకి వెళ్లకుండా తానంచర్ల - నకిరేకల్ 365 జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కానీ ఎమ్మెల్యే తన కాన్వాయ్ ఆపకుండా వెళ్లిపోయాడు. అనంతరం జాజిరెడ్డి గూడెంలో రైతు భరోసా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తిరిగి మండలంలోని మరో గ్రామం తిమ్మాపురంలో జరిగే కార్యక్రమానికి వెళ్లాల్సి ఉండగా అప్పటికే అర్వపల్లి వై జంక్షన్‌లో భారీగా కాంగ్రెస్ శ్రేణులు ఉండడంతో గంట సేపు ఆగి తిమ్మాపురానికి బయల్దేరగా కార్యకర్తలను చూసి వెంటనే యూటర్న్ తీసుకొని తిరుమలగిరికి వెళ్లాడు. దాంతో మరింత ఆగ్రహించిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మొండి వైఖరి నశించాలని, ఎమ్మెల్యే మందుల సామేల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు వారిని నివారించి పంపించేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మోరపాక సత్యం, కాంగ్రెస్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేశ్, యువజన సంఘం మండలాధ్యక్షుడు శిగ నజీర్‌గౌడ్, కేశగాని మహేశ్వర్, ఖమ్మంపాటి వెంకటేశ్, వివిధ గ్రామశాఖల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కోదాడ, హుజూర్‌నగర్ మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

పనుల నాణ్యతలో రాజీ ఉండొద్దు

సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, జూలై 1 : కోదాడ, హుజూర్‌నగర్ మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 3న కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. కోదాడ మున్సిపాలిటీకి రూ. 20 కోట్లు, హుజూర్‌నగర్‌కు రూ. 10 కోట్లు, నేరేడుచర్లకు రూ. 5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఉదయం పది గంటలకు కోదాడ మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారని, అనంతరం కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్లలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.

బాల పురస్కార్‌కు దరఖాస్తులు

రామగిరి, జూలై 1 : 5 నుంచి 18 ఏండ్లు ఉండి క్రీడలు, పర్యావరణ పరిరక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీలో అసాధారణ ప్రతిభ సామర్థ్యాలు ఉన్న బాలలు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ బి.భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. https://awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని, ఎంపికైనా వారికి జనవరిలో రాష్ట్రపతి భవనంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంఈఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అర్హులైన విద్యార్థులతో దరఖాస్తులు చేయించాలని, పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని 9848578845 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఎస్‌జీటీల బదిలీలు పూర్తి

రామగిరి, జూలై 1 : టీచర్ల బదిలీల్లో భాగంగా నల్లగొండ జిల్లాలో ఎస్‌జీటీల బదిలీలు ముగిసినట్లు డీఈఓ బి.భిక్షపతి వెల్లడించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులంతా వారి పాత పాఠశాల నుంచి రిలీవ్ కావడంతోపాటు కేటాయించిన పాఠశాలలో చేరాలని సూచించారు. ఎస్‌జీటీ బదిలీలతో జిల్లాలో చేపట్టిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియ సజావుగా ముగిసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

15లోగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

రామగిరి, జూలై 1: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు-2024 కోసం జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులు ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని నల్లగొండ డీఈఓ బి.భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. అన్ని సర్టిఫికెట్స్‌తో http://nationala wardstoteachers.education.gov.inలో దరఖాస్తులు సమర్పించాలని, ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తుల కాపీని డీఈవో కార్యాలయంలో జతచేసి అందజేయాలని తెలిపారు.